కొడవటిగంటి కుటుంబరావు



# ఎక్కడైనా ఒకటే

వాళ్ళిద్దరూ ఆఖరుసారి సూరయ్యగారి గొడ్లసావిడి వెనక చింతచెట్లమధ్యకలుసుకున్నారు. అప్పటికి పొద్దుకి గంట అయింది. కనుచీకటిపడే సమయంలో శేషు అక్కడికి చేరి, పెద్ద చెట్టెక్కి కొమ్మల్లో కూచుని, రత్తమ్మకోసం ఎదురుచూడసాగాడు. ఎంతో సేపటికి గాని రత్తమ్మరాలేదు. నడ్డి ఆడించటాన్నిబట్టి చీకట్లోకూడ శేషు రత్తమ్మను పోల్చుకోగలిగాడు. తాను చెట్టుమీద ఉన్నట్టు గుర్తుగా సన్నగా ఈలపాట పాడాడు.

రత్తమ్మ చెట్టుచాటుకువచ్చి పైకి చూసి, "నువ్వొచ్చి శానాసేపయిందా?" అన్నది.

"కాలా మరీ?" అన్నాడు శేషు చెట్టుకొమ్మనుంచి వేళ్ళాడి, చేతులు వొదిలేస్తూ.

"ఏంటి మరిప్పుడూ?" అన్నది రత్తమ్మ.

"నువేచెప్పు. ఇంతకీ ఏం జేయదలిచా?"

"నేనేం జేసేదీ. నా బూడిదా? మా అయ్య నచ్చినా ఒప్పుగోడు-"

"అయితే నేను రైలుకింద బడా ల్సిందే?"

"ఛా! ఊరుకో." రత్తమ్మ తన మునివేళ్ళతో శేషు గుండెలమీద ఆవేశగా తడివింది. తరవాత శేషుకు దగ్గరగా జరిగి నిలబడింది.

వాళ్లిద్దరికీ జీవితంలో ఒకటే కోరిక-పెళ్ళాడాలని. కాని అది జరిగేదికాదు. ఆ అల్పప్రాణుల సుఖానికి అవాంతరంగా వాళ్ళకు మించిన శక్తులున్నాయి. రత్తి తండ్రిని ధిక్కరించలేదు. రత్తి తండ్రికి ఎదురుతిరిగి శేషు ఆ ఊళ్ళో బతకనూ లేడు.

ఈ అల్పప్రాణులు ఎంత సేపు మాట్లాడుకున్నా ఒకరిమీద ఒకరు ప్రమాణాలు చేసుకోగలరు; అమాయక మైన తమ ప్రేమను వాళ్ళకు అర్థమయే భాషలో వ్యక్తం చేసుకోగలరు; ఒకరి కోసం ఒకరు కొట్టుకుపోగలరు. అంతే తప్ప తమ మధ్యఉండే అగాధంమీదుగా దూకలేరు.

"మనం ఒక్కసారన్నా నిజంగా సుకపడలేదు రత్తీ-ఎవరూలేరు, ఏమంటావ్?" అన్నాడు శేషు రహస్యంగా.

"ఓరమ్మో, ఇంకేమైనా వుందా?" అన్నది రత్తి అతనిపట్టులో పెనుగు లాడుతూ.

"ఒక్కసారి, రత్తీ!...ఆ తరవాత రైలుకింద పడిపోతా!" అన్నాడు శేషు.

రత్తి ఏడిచింది. ఎట్లా ఓదార్చాలో శేషుకు చాతకాలేదు.

"ఊరుకో! ఇంతమాత్రానికే చస్తారా ఏం? అట్టా అనిపిస్తాదిగాని!" అన్నాడు శేషు.

"నా పెళ్ళయినాక నువేం జేస్తావో చెప్పు. చెప్పకపోతే నన్ను చంపుకు తిన్నట్టే!" అన్నది రత్తి.

"ఏదో నా యేడుపు నేనేడుస్తా."

"అంత వొట్టేసినా చెప్పవా?"

శేషు ఆరాటపడ్డాడు. వాడికి మాట్లా డాలని లేదు.

"పట్నం వెళ్ళిపోతా రత్తీ. సినిమాల్లో జేరతా," అన్నాడు బలవంతాన.

"అక్కడ మంచి మంచి ఆడోళ్ళంతా ఉంటారు గావాలి!" అన్నది రత్తమ్మ అసూయతో.

"ఆళ్ళందర్నీ గంగలో పడనీ."

"వొళ్ళుమాత్రం జాగర్త గుంచుకో."

"నే నుంచుకోను!" అన్నాడు శేషు మంకుతనంగా.

కాస్సేపు ఇద్దరికీ ఏం మాట్లాడాలో తెలీలేదు.

"అయితే, వద్దంటావా?" అన్నాడు శేషు.

"అమ్మో !...ఇక నే నెళ్లాలమ్మా ! శానా సేపయింది ఇల్లొదిలి !"

ముందు రత్తమ్మే వెళ్ళిపోయింది. శేషు మనస్సంతా అంధకారంలో మునిగిపోయింది.

ఒక్కసారి—ఒక్కసారన్నా రత్తి తనని సుఖపెట్టలేదన్న బాధే వాడికి మిగిలింది.

* * *

ఏడాది జరిగింది.

శేషు పట్నంలోచేరి, తిండికిమాడి, సినిమా కంపెనీలచుట్టూ తిరిగి ఎంతో కష్టపడ్డమీదట నౌకరువని సంపాదించి చివరకు ఎక్‌స్ట్రావేషాలు వేసేమూకలో చేరాడు. ఇది కొత్తజీవితం, కొత్తజన్మ.

అకస్మాత్తుగా ఒకరోజు బస్సులో వాడికి రత్తి కనిపించింది. వాడు మొదట గుర్తుపట్టలేదు. తరవాత గుర్తుపట్టాడుగాని తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు. రత్తి ముందే వాణ్ణిచూసి ఉండాలి. ఎంతసేపుచూచినా తనకేసి చూడనేలేదు.

శేషు దిగాలిసినచోటు వచ్చింది. కాని వాడు దిగలేదు. కండక్టరును పిలిచి, "చివరదాకా టిక్కట్టియ్యి" అని పావలా బిళ్ళ చేతిలో పెట్టాడు. మరి రెండు స్టాపుల అవలత రత్తి దిగింది ముందు సీటులోనుంచి ఎవడో కోరమీసాలవాడు లేచినిలబడి రత్తికి దిగమని సంజ్ఞ చెయ్యటం శేషు చూశాడు.

బస్సు మళ్ళీ కదలబోతుండగా శేషు కూడా దిగాడు. రోడ్డుప్రక్కగా ఇద్దరూ నడిచిపోతున్నారు. రత్తి నడ్డితిప్పు కొంచెంకూడా మారలేదు. యాభైగజాలు వెనకగా శేషు వాళ్ళను అనుసరించి నడిచాడు.

మధ్యలో ఒకే ఒక్కసారి రత్తి వెనక్కుతిరిగి శేషు తన వెంట వస్తూండటం గమనించింది. రత్తి మొహంలో శేషుకు భయం కనిపించింది.

వాళ్ళు ఒక సందులోకి తిరిగి ఒక పాతకాలపు పెంకుటింట్లోకి దూరారు. వాళ్ళింటి ముందుగా నడచి అంత దూరానఉన్న సిగరెట్టు బంకుదగ్గరికి వెళ్ళి కానీ బీడీలుకొని, ఒకటి కొబ్బరి తాటికి అంటించి ఆ ఇంటి వాకిలికేసే చూస్తూ నిలబడ్డాడు.

శేషు మూడోబీడీ కాలుస్తుండగా మీసాలవాడు బయటికివచ్చి మళ్ళీ బస్‌స్టాప్‌కేసి వెళ్ళాడు. శేషు వీధి మలుపుదాకా వెళ్ళి వాడు బస్సెక్కేన దాకా నిలబడి, పెంకుటింటికి తిరిగివచ్చి "ఎవరండి లోపలా ?" అని అరిచాడు.

రత్తి లోపలినుంచి తొంగిచూసి, "శేషూ ! రా లోపలికి" అన్నది.

"ఏంటిది, రత్తి ? ఇక్కడెట్లావచ్చి పడ్డావు ? నీ పెళ్ళి అయిందా ?"

"లేదు పెళ్ళి రేవనగా డబ్బుతీసు కొని పారిపోయి రైలెక్కా."

"ఎన్నాలయింది నువ్వొచ్చి ?"




"కాలా ఆరేడు నెల్లు."

"ఏం జేస్తున్నావు ?"

"సినిమాల్లో యేసాలేస్తున్నా. చిన్న వేలే. ఈసారి మంచి యేసం ఇస్తారంట ?" ఎక్స్ట్రావేషాలు వేస్తున్నానని శేషు కెందుకు చెప్పటం ?

"ఎందులో ?" అన్నాడు శేషు ఇంకో బీడీముట్టిస్తూ.

"అదేందో పేరబ్బా ! నువ్వు ?"

"నేనుకూడా పిల్ల యీరోవేసాలేస్తున్నా. ఎప్పుడో పెద్ద యీరో జేస్తారంట !"

"పోనీలే, పాపం ! బాగున్నావు గద !"

"నువ్వు ?"

"బాగనేవున్నా శేషూ !"

"ఒక్కసారైనా మనం సుఖపళ్లేదు. రత్తీ ! ఏవంటా ?" శేషు గొంతులో వెనకటి దైన్యంలో కొంతైనా రత్తికి వినిపించింది.

"అమ్మో ! సంపెయ్యడూ ?"

"అంతేనంటా ? ఏడీ, పొయ్యాడుగా ?"

"ఇప్పొద్రాడూ ?"

"అయితే నేనెల్లిరానా ?"

"మళ్ళీ అవుపిస్తాలే, శేషూ !"

"అట్టనేలే రత్తీ !"

శేషు బయటికొచ్చి బీడీ నేలకేసి విసిరికొట్టి తలపైకెత్తి దర్పంగా బస్ స్టాప్‌కేసి వెళ్ళాడు.

రత్తి కుళ్ళి కుళ్ళి ఏడవసాగింది. ఈ మీసాలవాడి పాలపడక ముందు నాలుగునెల్లు నానా అగచాట్లుపడి శేషు కోసం ఎందరినడిగిందో, ఎన్నిచోట్ల వెతికిందో రత్తమ్మ శేషుతో చెప్పనే లేదు.

ఎందుకు చెప్పటం ? చెప్పొకుని చేసేదేముందీ ?"

—